# పాత బాకీ

**శ్రీ తూములూరు వెంకటశాస్త్రి**

ఆ రోజు ఆదివారము. సంత వుందని బావగారి వూరు బయలుదేరాడు రామన్న. దారిపొడుగునా యింటి యిబ్బందులు, పసిపిల్లడితో బాలింత అయిన తన భార్య యిబ్బంది, తలచుకుంటూ తొందర తొందరగా తిరిగిరావాలనే వుద్దేశంతో చరచరా పోతున్నాడు.

బావగారియింటికి చేరేటప్పటికి బారెడు ప్రొద్దున్నది. కాళ్లు కడుక్కోటానికి నీళ్లందించింది చెల్లెలు. కుశలప్రశ్నలు జరిగిన మీదట, 'బావ యెక్కడికి పోయాడమ్మా' అని అడిగాడు.

"ఇప్పుడే సంతదాకా పోయివస్తానని పోయాడు. పాడిగేదె మంచిది ఏమైనా దొరుకుతుందేమోనని."

"నేనూ సంతకెళ్ళాలి. అయితే పోయి వస్తా" అంటూ మంచినీళ్లు త్రాగి లేచాడు.

బావమరదు లిద్దరూ సంతలో కలుసుకొని మాట్లాడుకుంటూ సరైన బేరం కుదరనందున సంత అయిపోగానే యింటిముఖం పట్టారు.

"ఏం బావా...గేదె కోసమేనా? నే నిస్తానన్నాగా, మా యింటి గేదెను."

"సరే మంచిదే కాని, నిన్ననే వస్తానంటివే రాలేదేం?"

"వద్దామనుకున్నా. గేదె తప్పించుకు పోతే, దానికోసం తిరగడంతో సరిపోయింది, బావా."

అట్లా మాట్లాడుకుంటూనే యింటికి చేరారు.

సీనయ్యకు సంతానము లేకపోయిన చింత ఒకటే. కాని, ఇల్లు, వాకిలి, స్వల్ప భూస్థితి కలిగి, తనొక పలుకుబడిదారుగా వున్నాడు. కాని పైస అంటే పదహారు ముళ్లు వేసేరకం.

"ఇక నేను పోయివస్తా బావా" అని మూట సర్దుకుంటున్నాడు. సీనయ్య వినీ విననట్టు అటు తిరిగి ఏదో పనిచేస్తున్నాడు. ఇదంతా చెల్లెలు గమనిస్తూనే వుంది. కాని, వుండమని తను చెప్పడానికి స్వతంత్రము లేదాయె. అప్పు డేమనకపోయినా, తరువాత చీవాట్లు పడాల్సి వస్తుంది. 'వెళ్ళి వస్తా' అని పిలిచిన రెండవపిలుపు, విన్నట్టుగా బావమరదివైపు తిరిగి చూచాడు.

"ఏమంత తొందర. ఈపూట యిక్కడే వుండు. చీకటిపడుతూందికూడా. ఇప్పుడు పోకపోతే యేమంత మునిగింది; సరే కాని పనిమీద బజారుకు వెళ్లివస్తా యిప్పుడే. ప్రయాణము ఆపు," అంటూ పైపంచ వేసుకొని బైటపడ్డాడు.

ఆరోజే ఎంత ప్రొద్దుపోయినా వస్తానని చెప్పివచ్చాడు రామన్న. చెల్లెలి బలవంతముమీద నైతేనేమి, అప్పటికి ప్రొద్దు క్రుంకటవల్ల నైతే నేమి, చెల్లెలి యింట్లో మకాం తప్పదనుకుంటున్నాడు.

భర్త బైటికి పోగానే, వంటింట్లోంచి వరండాలోకి వచ్చింది రంగమ్మ. అన్నను ప్రయాణం చేయవద్దని బ్రతిమిలాడింది. "ఆయన వుండగా పల్లెత్తుమాట మాట్లాడటానికి వీల్లేదాయె, యీపూట వుండిపో. బావగారుకూడా వుండమన్నారుగా! యింకేం యీపూట వుండిపోవచ్చు" అని బలవంతము చేసింది.

"ఉండటానికేమిగాని, బ్రహ్మాండంగా వాన వచ్చేటట్లుంది; ఇంట్లో యిబ్బందులు నీకు తెలియనివేమున్నవి. రెండునెలల పసికూనతో అదొక్కతే యింట్లో వున్నది. దాని ఒంట్లో కూడా సరిగాలేదు. ఇంట్లో పనికి-గొడ్డూ గోదా సవరించుకోటానికి ఎంత యిబ్బంది, రాత్రికి గేదెను పాలుతీసేవారు లేరు. 'చిన్ని' వుందనేకాని దానికేం తెలుసు పసిపిల్ల. వీళ్లతో ఎట్లా ఇబ్బంది పడుతుందో" అని యిబ్బందులు వెళ్లబుచ్చాడు.

సీనయ్య యింటికి చేరేటప్పటికి చాలా ప్రొద్దుపోయింది. బావమరదు లిద్దరికీ నీళ్లు పోసుకోటానికి, నీళ్లు తోడియిచ్చింది. నీళ్లు పోసుకొని వచ్చేసరికి వడ్డించి సిద్ధంగా వున్నది రంగమ్మ. భోజనము చేస్తున్నప్పుడు మజ్జిగన్నం సమయానికి సీనయ్యకు, గేదె సంగతి జ్ఞాపక మొచ్చింది.

"మజ్జిగనీళ్లకు మరీ యిబ్బందిగా వుంది, బోడిగేదెను తోలుతానంటివే మరెప్పుడు?"

"గేదకేం భాగ్యం! రేపీ పాటికి తోలనూ...మళ్ళీ సంతకు వచ్చేటప్పుడు తోలుకవస్తా."

భోజనాలు అయినతర్వాత అరుగుమీద కూర్చొని చెరొక ఛటాకు చుట్ట వెలిగించి, మాట్లాడుకుంటున్నారు. పాలేరుచేత మిద్దెమీదికి మంచాలు పట్టించి, పక్కలు అమర్పించారు. పదిగంటలు దాటింది. తిన్నగా పైకి వెళ్లి పండుకున్నారు. మాటల సందర్భంలో రామన్న, తన కివ్వవలసిన డబ్బు సంగతి జ్ఞాపకం చేశాడు. అంటే గొడ్డూ గోదా మారుబేరారు చేసి సంపాదించినది. తన వద్ద వుంటే ఖర్చు అవుతుందని బావవద్ద వుంచమని ఆరేళ్లనాడు నోటుగానే యిచ్చాడు. పెండ్లిదగ్గరకు వచ్చిందని యిట్లా అన్నాడు రామన్న.

"చిన్ని పెండ్లి అనుకుంటున్నా. ఖర్చులకు చేతిలో చిల్లిగవ్వ లేదు. వున్నది కాస్తా మొన్న పురిటికే అయిపోయింది. యిబ్బందిలో వున్నా. కొంత డబ్బుయివ్వాలి బావా? లేకపోతే నే నిబ్బందిపడవలసివస్తుంది."

"నెలరోజు లుందిగా...అప్పటికి పత్తి యింటికి వస్తుంది. అది అమ్మిఅయినా ఇస్తా సగమైనా."

ఇట్లా ఒక గంటకాలం మాటలతో కాలం వెళ్లబుచ్చి మాట్లాడుతూనే నిద్రలో నిమగ్నులైనారు.

......................

కోడి కూసింది. అప్పటి కింకా చంద్రుడు చిరునగవుతో తొంగి చూస్తున్నాడు. కోళ్లకూతలకు, కుక్కల మొఱుగులకు రామన్న మేలుకొని నలువైపులా చూశాడు. బావగారు గుఱ్ఱుపెట్టి నిద్రపోతున్నాడు. తెల్లవారలేదు సరిగా. మరల పరుందామని తలవాల్చాడు. కాని అతని కెందుకో నిద్రపట్టట మటుంచి, యింటివద్ద యిబ్బంది జ్ఞాపకమునకు వచ్చి, తనొక్క క్షణమైనా నిలుచుటకు కాళ్లాడ లేదు. వెంటనే లేచి కూర్చున్నాడు. చుట్ట వెలిగించి, గబగబా మెట్లు దిగి క్రిందికి వచ్చాడు. 'అమ్మాయి, అమ్మాయి' అని చెల్లెలిని లేపాడు.

ప్రొద్దస్తమానం యింటి పనులు చేసి చేసి మైమరచి గాఢ నిద్రలో వున్న రంగమ్మ, ఉలిక్కిపడి లేచింది. "ఎందుకు అన్నా! యింత చీకట్లో లేచావు, తెల్లారలేదుగా?" అన్నది.

"ఏమీ లేదమ్మా ... కోడి కూసింది, మెలకువ వచ్చింది. మళ్లా నిద్రపోదా

మంటే నిద్రపట్టక, యింటికి పోదామనే ఆదుర్దా వున్నందున లేచివచ్చా. పోతేనే గాని కాదు" అని మాట మళ్లె సర్దుకొని బావనైనా లేపకుండా బయలుదేరాడు.

ఆవూరికి యీవూరికి మధ్య నాలుగు క్రోసుల దూరమైనా వుంటుంది. బండ్ల బాటన పోతే కొంచెం త్వరగా పోవచ్చు. కాని, బాట సరిగా లేక రాళ్లు రప్పలు ఎగుడు దిగుడుగా వుండి, ప్రయాణమునకు అనుకూలముగా వుండదనుకొని, కాలిబాటన బయలుదేరాడు రామన్న. అచ్చటచ్చట గుబురుగావున్న చెట్లమధ్యనుండి పోవలసి వస్తుంది. ఆ కాలిబాట అయినా నేరుగా లేక పొలాలమధ్యనుండి, ఫర్లాంగు దూరము చెరువుకట్టమీదుగాను పోయి పోయి బండ్లబాటలో కలుసుకుంటుంది. అంత చీకట్లో పోతున్నా నన్న ఆలోచన లేక త్వరితగతి నడక సాగిస్తున్నాడు.

ఊరుచేరుట కొక అరగంటయినా పట్టుతుంది. అకస్మాత్తుగా ఉన్నట్లుండి కాఱు మబ్బు లేకమై, గాఢాంధకార మావరించింది చినుకులు ప్రారంభమై, రానురాను వాన ప్రారంభించి, బాటంతా జలమయమై సరిగా కన్పించక యున్నది. తనెటు పోతున్నదీ తెలియక అయోమయావస్థలోనే పోతున్నాడు. పావుగంటకు వాన వెలిసింది. తెలతెల్లవారునప్పటికి తిన్నగా వూరి పొలిమేర చేరుకొని కొంచెము తెప్పరిల్లి, యింటికి చేరుకున్నాడు.

ఇంట్లో అడుగు పెట్టగానే 'చిన్ని' ఎదురైంది. "అమ్మకెట్లావుంది నెమ్మదిగా వుందా?" అని కూతుర్ని అడిగాడు.

"నెమ్మదిగా వుంది. 'అమ్మా-అమ్మా' నాయన వచ్చాడే" అంటూ తల్లిని పిలిచింది చిన్ని.

ప్రొద్దుటనే లేచి, పొయ్యిరాజేసి నీళ్ళు కాగబెట్టుతూంది అప్పుడే. పిల్ల పిలుపు వల్ల భర్త వచ్చాడని బైటికి వచ్చింది.

"రాత్రి రాలే దెందుకూ, బావగారి బలవంతమా?"

"అవునే! బలవంతముమీదనే వుండాల్సి వచ్చింది. కాని యింటివద్ద ఎట్లా వుందో అనే దిగులుతోనే వున్నాను. ప్రొద్దున్నే లేచి వద్దామని అనుకున్నవాడిని, కోడి కూయగానే మెలుకువవచ్చి, నిద్రపట్టక, మనస్సు వుండబట్ట లేక అట్లాగే బయలుదేరి వచ్చా."

"ఇంత తొందరపడి పోయినా, గేదెలు బేరం కాలేదా?"

"బేరం అయింది. కాని డబ్బు తక్కువయింది. దానికి తోడు బేరంలో లేడా వచ్చి తీసుకోవడం మానుకున్నా. వచ్చే వారపు సంతలో తీసుకోవచ్చులే" అన్నాడు.

"బావగారిక్కూ పాడిగేదె కావాలన్నా రంటివే, ఏమైనా బేరంచేశారా? అది సరేకాని, యిద్దరంకలిసి మారుబేరాలు చేస్తాము అంటివే, అదేమయింది?"

"రేపు వెళ్లినప్పుడు చెవినవేస్తా. తనే కుంటాడో తెలుస్తుంది. మనింటి గేదెను తీసుకోవాలని వుంది. డబ్బుమాట అటుంచి తోలిపెట్టమంటున్నాడు బావ."

"చిన్ని పెండ్లి అనుకుంటున్నామాయె... డబ్బు యిస్తానన్నాడా లేదా? 'సంతకు కావాలి బయానా యిచ్చాను బేరానికి' అని తొందర పెట్టు."

"రేపు సంతకు వెళ్లినప్పుడు అడిగి చూస్తా. ఎప్పుడడిగినా, ఇదుగో అదుగో అంటుంటాడు. పైసా యిచ్చిన పాపాన పోలేదు. అవసరానికి యివ్వకపోతే యింకెందుకు? కాని తొందరపడి ఖచ్చితంగా అడుగుతే యిచ్చేబాపతు కాదు" అంటూ నీళ్లు పోసుకోటానికి దొడ్లోకి వెళ్ళాడు.

* * *

సంతకు వెళ్లి రావటానికి ప్రయాణమైనాడు. 'గేదెను తోలుకరమ్మన్నాడే. తోలుకుపోకుండా వూరికే నేపోతే అడిగితే ఏమి సమాధానం చెప్పాలి!' అనుకుంటూ నడుస్తూన్నాడు. 'మేత సరిగాలేక వారం రోజులనుండి పాలు సరిగా యివ్వకుండా వుంది, నిన్న యివ్వాళ్ల అసలే యివ్వటం మానేసింది' అని అందామనుకున్నాడు.

మంచిమాటలతోనే తన కివ్వవలసిన డబ్బు వచ్చే మార్గం ఎట్లాగా అని ఆలోచిస్తూ ఈ ఆలోచనలతోనే వూరు చేరుకున్నాడు.

ఇంటికి పోతుండగానే దారిలో సీనయ్య అగుపించాడు.

'సంత అయిపోతుంది త్వరగా పోయి వద్దాము' అంటూ రామన్న బావను కలుసుకొని యింటిముఖం పట్టారు.

"ఇప్పుడు గేదెలకు మంచి బేరాలున్నాయి. యిప్పుడనంగ బేరాలు చేశామంటే మంచి లాభాలు వుంటవి" అని టూకీగా అందించాడు.

"మొన్ననే చూసివచ్చా. బండి, ఎద్దుల జత - బాగా వున్నవి. మీ ముసలి ఎద్దులకు తోడు అవి కూడా మారుబేరం చేశామంటే బాగుంటవి" అని మళ్లీ అన్నాడు రామన్న.

ఈ మాటలలో యింటిగేదెను తోలుతానన్నది. రామన్నను అడగటం మరిచాడు. అంతకుముందు తెచ్చిన ఎడ్లజత చౌకగానే తెచ్చాడు రామన్న. లాభాలు వచ్చే వ్యవహారాలు చెప్పేటప్పటికి 'లాభానికి లాభమొస్తుంది, పశువులను తెచ్చుకొని కొన్నాళ్లుపని గడుపుకొని, వాటిని మార్చి మరల మంచివి తెచ్చుకోవచ్చు" అని అనుకున్నాడు సీనయ్య.

బావమరదిని కలుపుకొని పశువుల బేరంలో డబ్బు సంపాదించాలనే ఆశ మొదటినుండీ, వున్నది సీనయ్యకు. 'డబ్బు పెట్టెలో దాచుకుంటె పిల్లలు పెడుతుందా? బావమరది వున్నాడాయె, తిరుగుడికి. తను హాయిగా యింటివద్ద కూర్చోవచ్చు.



తన స్వలాభం కొరకు వ్యాపారానికి పెట్టుబడి పెడితే, ప్రస్తుతం బావమరది కివ్వవలసిన డబ్బు అడగకుండా వుంటాడు; కొంతకాలం అట్లాగే గడపవచ్చు' అనుకొని "నేనూ అదే అనుకున్నా నీవు వచ్చాక చెపుదామని. సరే పద సంతకు పోయి వద్దాం" అంటూ లేచాడు.

"తనకు యిబ్బందిగా వుంది, డబ్బు కావాలంటే ససేమిరా లేదన్నాడు. యిప్పుడు తన స్వలాభంకోసం చెప్పితే, మూలవున్న మూట తెస్తున్నాడు. ఇటువంటి మొండివాళ్లకు తగిన శాస్తి కావాలసిందే" అనుకున్నాడు మనస్సులో.

ఆ రోజు సంతలో మంచి గేదెలున్నాయి. గంటలోనే నాలుగు గేదెలను బేరం చేశారు. ఒక కోడెదూడను కూడా అయిదువందల ఖరీదుకు బేరంచేశారు. 'కోడెదూడను మేపుకొని తయారుచేస్తే మంచి లాభానికి ఎప్పటికైనా పోతుందని' అనుకున్నారు.

పశువులను తోలుకొని యింటికి వచ్చారు. 'యిన్ని పశువులు తన అన్న ఎప్పుడూ బేరం చేయలేదే! ఈ రోజు ఇంత డబ్బు ఎక్కడిది' అని ఆశ్చర్యపోయింది చెల్లెలు. చివరికి అన్న ద్వారా అన్ని విషయాలు తెలుసుకున్నది.

"సాయంత్రానికే యింటికి పోవాలి. మంచి బేరాలు కుదిరిందాకా, అక్కడక్కడికి వెళ్లి మాట్లాడాలి. మళ్ళీ త్వరగానే వస్తా" అని బావతో చెప్పి ప్రయాణమైనాడు.

"సరే మంచిది. ఆలస్యమైనా బేరం సరిగా చెయ్యి. నీకష్టం వుంచుకోను. నీకూ నాకూ నాలుగు పైసలు వచ్చేటట్లు చూచుకో"

అన్నం తినకుండా అడావిడిగా పోతున్నాడని, అదివరకే చేసివుంచిన కుడుములు రెండు తింటానికి యిచ్చి, నాలుగు మూటకట్టి యిచ్చింది చెల్లెలు.

పశువులతో బావమరది ఒక్కడే అవస్థపడలేడని, పాలేరును కూడా తోడుయిచ్చి పంపాడు.

పశువులను తోలుకొని బయలుదేరి దీపాలు పెట్టే వేళకు యింటికి చేరుకున్నాడు రామన్న.

నాల్గురోజులు గడచినవి. పశువుల తోలుకొని మారుబేరానికని వెళ్లి త్వరగా వస్తానని చెప్పిపోయాడు. 'యింకా రాలేదెందుకో...' రేపో మాపో వస్తాడని ఎదురుచూస్తున్నది. రామన్న భార్య.

వారం రోజుల్లోనే, తోలుకపోయిన గేదెలను అమ్ముకొని మంచి లాభంతోనే వచ్చాడు. "బావ యిచ్చేది లేదు, నేను తీసుకుంటేది లేదు. అనుకున్న పాతబాకీ యీ విధంగానైనా వచ్చింది. తీరా మిగిలిపోయిందాకా యింకేమి చేస్తాడు' తగిన సమాధానం చెప్పొచ్చు" అనుకున్నాడు.

వారము వారము నాగాలేకుండా సంతకు బావగారి వూరు వెళ్లేవాడు. నెల పైగా అయింది. సంతకు పోవటము మానుకున్నాడు.

"ఇన్ని రోజులయింది. గేదెలను అమ్ముకొని వచ్చి, పదిరోజులలో వస్తానని రానందుకు, యేమనుకుంటాడో మీ బావ." అన్నది భార్య.

అనుకుంటే దేముంది; నోటుగావుంటే మటుకు వస్తుందని నమ్మకం. మనం చేసేదేముంది యొగ్గొడితే. పట్టుపట్టి వ్యవహారరీత్యా వసూలు చేయలేము.. దానికీ కొంత డబ్బు తగలెయ్యాలి. అదెక్కడనుండి వస్తుంది? నెమ్మదిమీద మంచి మాటలతోనే వచ్చే మార్గం చూడాలి"

అసలు పోకుండావుంటే అనుమానపడ్తాడని, ఓ రోజు బయలుదేరి వెళ్లాడు రామన్న.

ఇంటికిపోగానే ఒకరి నొకరు చూచి కూడా మొదట పలుకరించకుండా మౌనంగా కూర్చున్నారు. క్షణమాగి సీనయ్య యిట్లా అన్నాడు.

"త్వరగా వస్తానంటివే! యింత ఆలస్యమైన దెందుకూ? బేరము బాగా అయినట్టేనా?"

"బేరము బాగానే అయింది. యింటి గేదెను కూడా సరిగా పాలు యివ్వటంలేదని దాన్ని కూడా మారకానికి మాట్లాడి వచ్చా. వీటిని బేరమిచ్చిన చోటనే ఎడ్లను మారకానికి మాట్లాడాను. ఛషయిన ఎడ్లు వున్నవి. పదిరోజులైనతరువాత రమ్మన్నారు ఏ సంగతి చెపుతామని. గేదెలకు మారకంగా ఎడ్లనుగాని, డబ్బుగాని వసూలు చేసుకొని, అప్పుడే మన ఎడ్లు మారకం చేసుకోవచ్చు" అనుకున్నాను.

"సరే కాని సంతరోజు వచ్చేవాడివి ఈరోజు వచ్చావేం? ఇంటిగేదె అంటే జ్ఞాపకం వచ్చింది. దాన్ని తోలుతానంటివే. నేను అడగటం మర్చాను. అమ్మేశావన్నమాట."

"అయితేనేం బావా! రేపీపాటికి కొనలేమూ. ఏం భాగ్యం... మన గేదెలకు మారకముగా మంచి ఎడ్లజతకు ప్లాను వేసి వచ్చా. అందుకనే ఆలస్యమైనా వూరుకోవలసి వచ్చింది." అన్నట్లు చెప్పటం మరచాను. కోడెదూడకు మేత బొత్తిగా లేదు... అందుకని కాస్తో, కూస్తో, కొనుక్కుంటే మంచిది"

"కొనటం ఎందుకు? మన చొప్ప దొడ్లో వుంది. తీసుకొనిపో ఒక అరబండి: మేత లేకపోతే చిక్కిపోతుంది. పాలేరును పిలిపిస్తా బండికి వేయించుకొనిపో" అన్నాడు సీనయ్య.

మేత బండికి వేయించుకొని ప్రయాణమై పోతూ 'వారంరోజులలోనే 'చిన్ని' పెండ్లి నిశ్చయించుకున్నాము. ముందుగా చెల్లెల్ని పంపవలసింది. ఇంట్లో చేసేవాళ్లు కూడా లేరు. యిబ్బందిగా వుంది' అని బావతో చెప్పి; చెల్లెలి కొకమారు 'త్వరగా

(38-వ పేజీ చూడండి)



# పాత బాకీ

(22-వ పేజీ తరువాయి)

రావాలిసుమా' అని హెచ్చరించి బండి కట్టించుకొని బయలుదేరాడు.

పెండ్లిపిలుపు అయింది కాని, పెండ్లికి యివ్వమన్న డబ్బు బావను అడగలేదు రామన్న. పెండ్లిఖర్చుకు కావాలన్నాడే, అడిగతే దెందుకో! ఆ సంగతి నేనెందుకు యెత్తాలి. అడగందే మంచి' దనుకున్నాడు సీనయ్య.

నాల్గురోజు లుండనగానే ముందుగా చెల్లెల్ని పంపమని, బావనుకూడ త్వరగా రమ్మనమని కబురంపాడు రామన్న. మర్నాడే చెల్లెలువచ్చింది. పెండ్లిపనులు సిద్ధంచేసుకొని వున్నారు. తనకున్న తాహతుప్రకారము పెండ్లిప్రయత్నాలు చేసుకున్నాడు. అంతా పెండ్లి అడావిడిలో వున్నారు.

రెండవరోజు పెండ్లి అనగా సీనయ్య కూడా వచ్చి చేరాడు. అనుకున్న లగ్న నిశ్చయంరోజుకు పెండ్లివారు చేరుకున్నారు. ఉదయం పదింటికల్లా 'చిన్ని'ని పెండ్లికూతురును చేశారు. బాజాభజంత్రీలతో క్లుప్తంగా పెండ్లిజయప్రదంగానే జరిగింది.

మూడునిద్రలు కాగానే ఎటువారటు వెళ్లారు, సీనయ్యకూడా భార్యతో ప్రయాణమౌతున్నాడు. 'అందరూ ఒక్కసారే వెళ్లితే యింట్లో యేమీ తోచదు' అని బలవంతము చేయగా, భార్యను వుంచి తనొక్కడే వెళ్లాడు.

అదృష్టపు రోజులేమో! పసిబిడ్డ పుట్టినప్పటినుండి గొడ్లబేరముగాని, సంసారవిషయములలో గాని కలిసి వస్తున్నది రామన్నకు. కూతురిపెండ్లి చేసుకున్నాడు. బావధర్మాన పాతబాకి వచ్చినట్టే. వృద్ధిలోకి వస్తున్న కోడిదూడ యింట్లో వుంది. ఇంకేమి కావాలి. ఈ పెట్టుబడిమీదనే మారు బేరాలు చేస్తూ ఒకదానికొకటి కూడేసుకొని వ్యాపారము సాగిస్తున్నాడు. ఈ సంగతి బావతో చెప్పాలనుకున్నాడు.

చెల్లెలు వచ్చి చాలా రోజులయింది. తను బావగారి వూరుపోక యెన్నో రోజులయింది. అందుకని చెల్లెల్ని తీసుకొని బావగారి వూరు వెళ్లాడు. ఆరోజు అచ్చటనే వుండక తప్పిందికాదు.

భోజనానికి యింకా ఆలస్యమున్నదని, మిద్దెమీదికి వెళ్లి కూర్చున్నారు. మాటల సందర్భంలో వ్యాపారం విషయాలు చర్చకు వచ్చాయి. అంతలో భోజనానికి పిలుపు వచ్చినందున క్రిందికివచ్చినారిద్దరు.

భోజనానంతరము వరండాలో అరుగుమీద కూర్చొని చుట్టలు వెలిగించారు. వర్షం వచ్చే సూచనలుండి, చలిగాలిగా వున్నదని వరండాలోనే పడక ఏర్పాటు అయింది.

"డబ్బుసంగతి చెబితే యేమనుకుంటాడో బావ; ఎప్పటికైనా చెప్పాలిగా. మర్మమేముంది యిందులో" అనుకొని

"అయిదువందల దాకా గేదెల బేరానికి యిచ్చావు. వాటివల్లనే. చేతిలో పైసాలేని సమయములో పెండ్లియిబ్బందికి వాడుకున్నా. చిల్లరఅప్పులు పీక్కుతింటుంటే కొంత ఖర్చు అయింది. ఖర్చునపడివున్నా. సంసారం గడవటంకూడా కష్టంగా వుంది- ఈ సమయంలో ఈ సంగతి చెబుదామని వచ్చా నీ వేమనుకుంటావో అని." అని ప్రాధేయపూర్వకంగానే చెప్పుకున్నాడు.

"బాగానే వుందోయ్ యీ యెత్తు! దానికని దీనికని బాకీ వసూలుచేసినట్టుందే? 'నాకు యివ్వవలసింది యివ్వమని' ఖచ్చితంగా అడుగుతే యివ్వనన్నానా? మొన్న యీమధ్య అడిగితే పత్తి అమ్మి యిస్తానన్నాగా. నీసొమ్ము నాకెందుకు? కష్టపడి వ్యాపారం చేసుకుంటుంటే, దాంట్లో వచ్చే లాభంతో నీసంసారం గడుస్తుంటుంది. నీకు యివ్వవలసిన డబ్బు, అంతగా యిబ్బందిగా వుంటే యివ్వొచ్చు. లేకపోతే నా యిబ్బంది సిబ్బందులకు ఆసరగా వుంటుందనుకున్నా. నాదేం పోయింది- నేను మునిగింది లేదుగా! కావలసినది మాటా మంచీ. నాలుగు రోజుల్లో యిద్దామనుకున్నదేగా" అన్నాడు ధర్మదాతలాగ.

"అడిగితే అంత కష్టమెందుకు బావా!... వూరికే యిస్తున్నట్టు విసుక్కుంటున్నావ్? కష్టార్జితపు డబ్బు నీవద్ద వుంచుకొన్నది. కోపగించుకొని తగవులాడే దేముంది దీంట్లో. పెండ్లికి యితరత్రా ఖర్చునపడి వున్నా. సంసారం గడవాలి యింకా. ఇది కూడా నీ చలవే అనుకుంటా; తలిమ్మా రెండువందలు యిచ్చావంటే తీరిపోతుంది పాతబాకి. ఏదో సామెతగా వున్నది మన వ్యవహారము." అని ఖచ్చితంగానే అడిగేశాడు.

"ఎప్పుడో ఒకప్పుడు కొద్ది కొద్దిగా యిస్తూ కాలయాపన చేద్దామనుకుంటే 'గూగా' వాడిలాగా పాతబాకీ యుక్తిగా లాగేశాడే చేతికి చిక్కిందనీ :. చేసేదేముంది? ... ఎట్లాగూ అయిదువందలు చేజారిపోయినవి. వడ్డీ పెరగటమెందుకు. నోటు నోటుగా ఎందుకుండాలి. చెల్లు వేయించుకోవాల్సిందే" అనుకున్నాడు సీనయ్య.

చాలా ప్రొద్దుపోయిందాకా డబ్బువ్యవహారంతోటే కాలము వెళ్లబుచ్చారు. నిద్ర ఆపుకోలేక సీనయ్య మాట్లాడుతూనే నిద్రపోయినాడు. గడచిన విషయాలు ఆలోచిస్తూనే రామన్నకూడా తల వాల్చాడు.

రాత్రంతయు వాన తుప్పరలు పడుతూనే యున్నవి. తెల్లవారు ఝామునకు చినుకులు ఆగిపోయినవే కాని, చలిగాలి వీచుచున్నది. నల్లని మేఘములు ఆకాశము నలముకొని తెల్లవారినప్పటికి సూర్యరశ్మి లేక ముసిముసి చీకటిగానే వున్నది.

తెల్లవారిందని లేచి కూర్చున్నాడు రామన్న. అప్పటికే బారెడు ప్రొద్దెక్కింది. త్వరగా లేచి కాలకృత్యములు తీర్చుకొని ప్రయాణమౌతున్నాడు. యింతలోనే సీనయ్యకూడా లేచి గబగబా ముఖం కడుక్కొని, బావమరది చెప్పకుండా పోతాడేమోనని, త్వరగా వచ్చి కూర్చున్నాడు.

"కొద్దో గొప్పో బేరంలో లాభం వస్తుంటుంది. అయిదువందలు గేదెలకు ఖర్చుపెట్టి యిచ్చానాయె. యింకేం కావాలి! ఇంకా డబ్బు అడుగుతున్నావేమోయ్? నేనిచ్చేది లేదు, నీవు తీసుకునేది లేదు. నీ కివ్వాల్సినదానికన్నా ఎక్కువగానే ముట్టింది. నీకు తెలియదూ తిన్నవాడివి. నోటు చెల్లేసిపో" అన్నాడు.

"పేచీ పెట్టుకోకుండా యింతటితో ఈ పాడుపీడ వదిలిందనుకున్నాడు." రామన్న.

"సరే నీయిష్టమువచ్చినట్లు కానియ్య బావా. నేను నీమాట కాదన్నానా'" అని నోటు చెల్లువేసి యిచ్చాడు.

తగవులాటదాక ముదరక సవ్యంగానే ఒప్పందాలు జరిగాయి చేసేది లేక. 'మొండి బాకీ, పాతబాకీ వసూలైందని' రామన్న, 'అయిదు వందలతో, ఏడువందల రూపాయిల నోటు చెల్లు అయిందని' సీనయ్య, యిద్దరూ తృప్తిపడ్డారు అంతటితో.

రామన్న మూటముల్లె సర్దుకొని బయలుదేరాడు, ఇంటికి పోదామని. చెల్లెలి బలవంతముమీద 'చద్దిఅన్నం వుంది, తిని పొమ్మంటే' అన్నం తిని "అమ్మాయి రంగమ్మా! బావధర్మమంటూ, 'చిన్ని' పెండ్లి జరిగింది. అప్పులుంటే తీరిపోయినవి. పిల్లవాడు పుట్టిన ఘడియ-కోడె దూడ వచ్చిన వేళా విశేషమేమో! నా సంసారం చక్కబడి, నాలుగురాళ్లు సంపాదిస్తున్నా. మొండి కేసుకొని నీళ్లోదులుకున్న 'పాత బాకీ' వసూలయింది తల్లీ! యిక నేను పోయివస్తా" అంటూ యింటిదారి బట్టాడు రామన్న.

★